సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 10 । జూలై । 2023



తీగే జీవనాధారం

అటవీ ప్రాంతంలో చెట్లపైకి పాకే నల్లతీగ సేకరణ గిరిజనులకు జీవనాధారం. ఈ తీగను కొల్లేరు ప్రాంతంలో చేపలు పట్టేందుకు బుట్టలు చేసేందుకు ఉపయోగిస్తారు. 8లో



ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు

భీమడోలు రైల్వే గేటు వద్ద ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో ట్రాక్టర్ రెండుగా విడిపోయింది. 8లో



40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఏలూరు ఎంఆర్‌సీ కాలనీ నుంచి రవాణా చేస్తున్న 40 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు పరిసర ప్రాంతాల నుంచి సేకరించి తరలిస్తుండగా పట్టుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ తల్లి గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన భక్తులు ఆషాఢ మాసం మూడో వారం కూడా పెద్ద ఎత్తున బోనాలతో అమ్మ వారి సన్నిధికి ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆదివారం కూడా భక్తులు ఆషాఢమాసం బోనాలు సమర్పించారు. గుడి సమీపంలోని వ్యాపార దుకాణాల వద్ద నృత్యాలు చేస్తూ పలువురు భక్తులు సందడి చేశారు. లారీలు, ఆటోలు, బస్సులు, జీపులు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కమిటీవారు భక్తులకు ట్రాఫిక్ సమస్య, ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టారు.

స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటిన షణ్ముఖ్



స్విమ్మింగ్ పోటీల్లో గెలుపొందిన షణ్ముఖ్

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు బాలుడు సత్తా చాటాడు. రెండు రోజుల క్రితం కడప జిల్లా వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఏలూరు బాలుడు తాడి షణ్ముఖ్ శ్రీవెంకటసాయి బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో తలపడి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. 6వ తరగతి చదువుతున్న ఈ బాలుడు ఏడాది నుంచి స్పోర్ట్స్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్నాడు.

ప్రపంచ కప్ టెన్నికాయిట్ పోటీలకు మాధురి



ప్రపంచ కప్ టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన హేమమాధురి(ఎడమ నుంచి మొదట వ్యక్తి)

ఏలూరు రూరల్ : దేవరపల్లి గ్రామానికి చెందిన జి.హేమ మాధురి ప్రపంచ్ కప్ టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన అంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశ వివరాలు ఆయన వెల్లడించారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 8 వరకూ సౌతాఫ్రికాలో ప్రపంచ కప్ పోటీలు జరగనున్నాయని వివరించారు. ఈ పోటీలకు ఎంపికై న నలుగురు క్రీడాకారుల్లో హేమమాధురి ఉండడం గర్వ కారణమన్నారు. ప్రభుత్వం జీఓ-74 సవరించి టెన్నికాయిట్ క్రీడాకారులకు సైతం ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ సమావేశం తీర్మానం చేసిందన్నారు.

ధర్మాన్ని పాటిస్తేనే సమాజాభివృద్ధి

పాలకొల్లు సెంట్రల్: ధర్మాన్ని పాటించాలి అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. ఆదివారం పాలకొల్లులో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ ముగింపు ఉత్సవాలు చేయడం గొప్పవిషయమని అన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే పెన్మెత్స విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ అల్లూరికి భారతరత్న ఇవ్వాలని కోరారు. సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పిన బీజేపీ ఇప్పటి వరకూ ఎందుకు ఇవ్వలేదని దీనిపై బీజేపీ నాయకులను ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎంపీ జి.హర్షకుమార్, బంగారు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

యంత్రం.. సాగుకు ఊతం

- రైతులకు రాయితీపై యంత్రాలు
- జిల్లాలో 1,671 మంది రైతులకు అందజేత



ఆచంట మండలం తూర్పుపాలెంలో పవర్ టిల్లర్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు(ఫైల్)

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులకు వెన్నుదన్నుగా నిలవడానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో కేవలం ఏడాది కాలంలోనే 1,671 మంది రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందచేయగా దాదాపు రూ.11.55 కోట్లు సబ్సిడీ లభించింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి వ్యవసాయ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండడమే గాక తక్కువ ధరకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంటలకు విక్రయించుకుంటే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేసేలా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. దీంతో ధాన్యం కమిషన్ వ్యాపారులు, మిల్లర్ల ప్రమేయం లేకుండా కేంద్రప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశం ఏర్పడింది. ధాన్యం విక్రయిస్తే రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుండగా ధాన్యం పట్టుబడికి గోనెసంచులు సైతం ప్రభుత్వమే సరఫరా చేస్తుండడం విశేషం. పంట దెబ్బతిన్న రైతులకు ఏ సీజన్‌కు అదే ఏడాదిలో పంటల బీమా చెల్లించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్స్ అనే పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ అందచేస్తున్నారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్స్ పథకంలో అయిదారుగురు రైతులు గ్రూపుగా ఏర్పడితే 40 శాతం సబ్సిడీపై యంత్రాలను అందచేస్తున్నారు. అంతేగాకుండా రైతులు కేవలం 10 శాతం సొమ్ము చెల్లిస్తే జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో 40 శాతం రుణాలు ఇప్పించి దానిని మూడేళ్లలో చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు.

జిల్లావ్యాప్తంగా యంత్ర పరికరాల పంపిణీ

జిల్లాలో సుమారు 2.15 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా మొదటి దశలో 1,034 మంది రైతులకు 1,130 యంత్ర పరికరాలు అందించి దానికి సుమారు రూ.7.24 కోట్లు, రెండో దశలో 637 మంది రైతులకు 509 యంత్రాలను పంపిణీ చేసి వారికి రూ.4.31 కోట్లు సబ్సిడీగా అందించారు. వీటిలో 105 ట్రాక్టర్లు, 1,096 పవర్ టిల్లర్స్, 330 స్ప్రేయర్లు, 6 కల్టివేటర్స్, 72 రోటోవేటర్స్, 47 రౌండ్ స్ట్రా బెలర్ మరికొన్ని ఇతర పరికరాలను సబ్సిడీపై అందజేశారు.

రూ.3.17 కోట్ల సబ్సిడీ

జిల్లాలోని రైతులకు 36 వరికోత యంత్రాలను పంపిణీ చేసి వాటికి రూ.3.17 కోట్లు సబ్సిడీగా అందచేశారు. వరికోత యంత్రాలకు గ్రూపు సభ్యులు 2.50 ఎకరాల భూమిని బ్యాంకుకు హామీగా ఇస్తే రుణం మంజూరు చేస్తారు.

పెద్ద ఎత్తున సబ్సిడీ యంత్రాలు



జిల్లాలోని రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీ యంత్రాలను పంపిణీ చేస్తున్నాం. 1,671 మంది రైతులకు సుమారు రూ.11.55 కోట్లు సబ్సిడీగా అందించాం. ఈ ఏడాది రైతులకు స్ప్రేయర్లు, బరకాలు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశాం.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

సబ్సిడీపై పవర్ టిల్లర్ తీసుకున్నా..



ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో గత ఏడాది సబ్సిడీపై పవర్ టిల్లర్, రోటోవేటర్స్‌ను ఐదుగురు సభ్యులతో కలిసి తీసుకున్నాం. పవర్‌టిల్లర్ ఖరీదు రూ.1.85 లక్షలు కాగా దానిలో రూ.70 వేలు ప్రభుత్వం సబ్సిడీ, అలాగే రోటోవేటర్ ఖరీదు రూ.1.20 లక్షలు కాగా రూ. 33 వేలు సబ్సిడీ వచ్చింది.

– భూపతిరాజు రంగరాజు, రైతు, విస్సాకోడేరు

సాగునీరు విడుదల



ఎర్రకాలువ జలాశయం పంట కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ రంగంలో రాణించాలని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం కుడి, ఎడమ కాలువల నుంచి వ్యవసాయానికి సాగునీటిని ఎమ్మెల్యే ఎలీజా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయానికి ఎర్రకాలువ ద్వారా 10 వేల ఎకరాలకు సాగునీటికి అందించేందుకు నీటిని విడుదల చేశామన్నారు. పంటలకు పూర్తి స్థాయిలో సాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. వ్యవసాయానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, మద్ది ధర్మకర్తల మండలి సభ్యులు మట్నీడి బాబి, దండు ధనరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ల శ్రీనివాసరెడ్డి, కొయ్య లీలాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పెదఅమిరంలో వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సమక్షంలో పార్టీ క్యాంపు కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రసాద్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల హామీలు అమలు చేయడం వల్ల వైఎస్సార్‌సీపీ నాయకులు గర్వంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామన్నారు. అంతేకాకుండా ఓ పక్క అభివృద్ధిని మరోపక్క సంక్షేమాన్ని రెండు కళ్లుగా ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. గతంలో ఉండి నియోజకవర్గంలో నష్టపోయామని ఈ సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి పీవీఎల్ నరసింహరాజును గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పవన్‌ది కుల బలమా? ప్రజా బలమా?: గ్రంధి శ్రీనివాస్

పవన్‌ది కుల బలమా.. ప్రజా బలమా స్పష్టం చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీకి రెండు జిల్లాల్లో ఒక్క సీటు కూడా రానివ్వకూడదంటున్న పవన్ సొంత బలం ఏంటని అడిగారు. కుల బలమా.. ప్రజా బలమా స్పష్టం చేయాలన్నారు. కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి లేకుండా సీఎం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో అవినీతికి పాల్పడ్డారని గుర్తు చేశారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు చేసిన అవినీతి పవన్‌కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. పీవీఎల్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, గోకరాజు రామరాజు, ఉమాబాల, జెడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, కోపల్లె, కల్వపూడి, కాళ్ల సొసైటీల అధ్యక్షులు వేగేశ్న కృష్ణంరాజు, పెనుమత్స దుర్గాప్రసాద్, సుంకర భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు' చారిత్రాత్మకం

- తణుకులో 100వ రోజుకు చేరిన 'గడప గడపకు' కార్యక్రమం
- పథకాల లబ్ధిని వివరించిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు 28వ వార్డులో కేక్ కట్ చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరరావు

తణుకు అర్బన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చారిత్రాత్మకమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 100 రోజులు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని 28వ వార్డులో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రతి గడపలోనూ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. నాలుగేళ్లుగా ప్రజలకు సంక్షేమ లబ్ధి చేకూర్చడంతో ప్రతి గడప ముందుకు వెళ్లగలుగుతున్నామన్నారు. టీడీపీ నాయకులు ఏం చేశామని చెప్పుకుని ప్రజల ముందుకు వెళ్తారని నిలదీశారు. సంక్షేమం అంటేనే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డితో పుట్టుకొచ్చిందని అదే ఒరవడి ఆయన తనయుడు సీఎం జగన్ మరింత ముందడుగు వేసి కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. ఏ గడపలోకి వెళ్లినా ప్రజలు ఆదరంగా స్వాగతం పలుకుతున్నారన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి రూ.2,432.66 కోట్లు

నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో సంక్షేమ పథకాలకు రూ.1,633.38 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.799.28 కోట్లు వెచ్చించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గడపగడపకు కార్యక్రమంలో సమస్యల పరిష్కారంలో భాగంగా డ్రెయినేజీలు, రహదారుల నిర్మాణాలకు రూ.4 కోట్లు వెచ్చించామని, రానున్న ఏడాది కాలంలో మరిన్ని నిధులు సమకూర్చి అభివృద్ధి చేస్తామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో ఇప్పటివరకు 34 సచివాలయాలు పరిధిలో 26,454 ఇళ్లను సందర్శించామన్నారు. ముందుగా 28వ వార్డు శివాలయం వీధి నుంచి గడపగడపకు కార్యక్రమం ప్రారంభించి శివాలయం వీధి కనకదుర్గమ్మ గుడి ప్రాంతంలో సభ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'క్లాప్'తో చెత్తకు విముక్తి

- పట్టణాల పరిశుభ్రత కోసం క్లీన్ ఆంధ్రప్రదేశ్ ప్రారంభం
- జిల్లాలో 5 మున్సిపాలిటీలకు 127 వాహనాలు
- నెలకు 7,620 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ



తణుకులో చెత్త సేకరణ చేస్తున్న వాహనం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణాల్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమం అమలుచేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయి. జిల్లాలో 5 మున్సిపాలిటీలకు చెత్త సేకరణ వాహనాలను అందించారు. మున్సిపాలిటీకి 16 నుంచి 35 వరకు వాహనాలు వచ్చాయి. గతంలో ఎక్కడ చెత్త అక్కడే ఉండేదని, ఇప్పుడు క్లాప్ వాహనాలు వచ్చి చెత్తను ప్రతి రోజు ఉదయమే తీసుకువెళ్లడంతో పరిసరాలు శుభ్రంగా ఉంటున్నాయని అంటున్నారు.

ఏడాదిన్నర క్రితం జిల్లాలోని పట్టణాలకు చెత్త సేకరణ కోసం క్లాప్ కార్యక్రమంలో 127 వాహనాలు వచ్చాయి. అప్పటి నుంచి ఈ వాహనాల ద్వారా పట్టణాల్లో చెత్త సేకరణ చేస్తున్నారు. ఇవి వచ్చాక మున్సిపల్ చెత్తసేకరణ వాహనాలకు భారం తగ్గింది.

మూడు రకాల చెత్త సేకరణ

పట్టణాల్లోని ప్రతి వార్డుకు ఉదయం 5.30 గంటలకు ఈ వాహనాలు చేరుకుంటున్నాయి. మధ్యాహ్నం వరకు వార్డుల్లో తిరుగుతూ ఆయా వార్డుల్లోని ఇళ్ల వద్ద మున్సిపాలిటీ వారు ఇచ్చిన మూడు రకాల డస్ట్‌బిన్‌ల్లోని తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను విడివిడిగా సేకరించి తీసుకువెళ్లి కేటాయించిన ప్రదేశంలో డంప్ చేస్తున్నారు. వాహనంలో మూడు రకాల చెత్త వేయడానికి మూడు విభాగాలు ఉండేలా ఏర్పాటు చేశారు. ఈ వాహనానికి డ్రైవరుతో పాటు చెత్త సేకరణకు ఇద్దరు పనిచేస్తారు. సేకరించిన తడి, పొడి చెత్తను ప్రత్యేకంగా నిర్మించిన షెడ్లకు చేరుస్తారు. తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు ఉచితంగా అందించాలని, పొడి చెత్తను రిసైక్లింగ్ చేయడం, ఇతర చెత్తతో బయోగ్యాస్, విద్యుత్ ఉత్పత్తి తదితర వాటికి ఉపయోగించాలని ప్రణాళికలు రుపొందించారు.

నెలకు 7,620 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ

జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు 127 వాహనాలు పనిచేస్తున్నాయి. ఈ వాహనాల ద్వారా నెలకు 7,620 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతుంది. ప్రతి వాహనం రోజుకు సుమారు 30 కిలోమీటర్లు తిరుగుతూ రెండు టన్నుల చెత్త సేకరిస్తాయి.

పట్టణాల వారీగా వాహనాలు

పట్టణం	వాహనాల సంఖ్య	రోజుకు సేకరిస్తున్న చెత్త(టన్నుల్లో)
భీమవరం	35	70
తాడేపల్లిగూడెం	33	66
తణుకు	24	48
పాలకొల్లు	19	38
నర్సాపురం	16	32

విజయవంతంగా ప్రాజెక్టు



5 పట్టణాల్లో 127 వాహనాలతో చెత్త సేకరిస్తున్నాం. క్లాఫ్ మంచి ఫలితాలు ఇస్తుంది. ప్రతిరోజు ఉదయమే వార్డులకు వెళ్లి చెత్త సేకరిస్తున్నాం. పారిశుధ్య అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేస్తున్నాం.

పేకేటి రాజేష్, క్లాప్ జిల్లా ఇన్‌చార్జ్

చెత్త నుంచి సంపద సృష్టి



క్లాప్ కార్యక్రమంలో వచ్చిన వాహనాలు ద్వారా పట్టణాల్లో తడి, పొడి చెత్త సేకరిస్తున్నాం. ఈ చెత్త నుంచి సంపద సృష్టించే బాధ్యతలను హెచ్ ఆర్ స్కేర్ సంస్థకు అప్పగించాం. అందుకు సంబంధించిన కార్యచరణ రూపొందించాం.

– టి.సుధాకర్, భీమవరం ఇన్‌చార్జ్ కమిషనర్

ఆక్వాలో ఇక్కట్ల పరిష్కారానికి కృషి



భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా ట్రేడర్స్ అసోసియేషన్ నాయకులు

సాక్షి, భీమవరం: ఆక్వా రంగంలో ప్రస్తుతమున్న ఒడిదొడుకులను నివారించడానికి ప్రభుత్వ సహకారంతో ఆక్వా ఎగుమతిదారులు, రైతులకు సంధాన కర్తలుగా వ్యవహరిస్తామని ఆక్వా ట్రేడర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమాల శ్రీరామమూర్తి చెప్పారు. ఆదివారం భీమవరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆక్వా ఎగుమతుల్లో సంక్షోభం కారణంగా రాష్ట్రంలోని రొయ్యల రైతులు, ఎగుమతిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల నుంచి రొయ్యల కొనుగోలు చేసే ట్రేడర్స్‌కు మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రైతులకు రొయ్యలు కొనుగోలుచేసిన వెంటనే డబ్బు చెల్లిస్తున్న ట్రేడర్స్‌కు ఎగుమతుల అనంతరం త్వరితగతిన నగదు రావడం లేదని కొన్ని సమయాల్లో ఇతర రాష్ట్రాల్లోని దిగుమతిదారులు మోసం చేయడం వల్ల ట్రేడర్స్ తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రేడర్స్ నష్టపోకుండా ఉండేందుకు అప్సడాలో రిజిష్టరయిన ట్రేడర్స్ మాత్రమే రొయ్యలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు శ్రీరామమూర్తి చెప్పారు. సమావేశంలో గౌరవ సలహదారుడు తోట భోగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర, కోశాధికారి కామన రాంబాబు, కన్వీనర్ ముతకన పిచ్చయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరా రామమూర్తి, సహాయ కార్యదర్శులు సరిపిడకల వెంకటేశ్వరరావు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, సహాయ కోశాధికారి దేవరపు రఘు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా భీమాల

ఆక్వా ట్రేడర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా భీమాల శ్రీరామమూర్తి ఎన్నికయ్యారు. ఈనెల 7న విజయవాడలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు శ్రీరామమూర్తి వెల్లడించారు. గౌరవాధ్యక్షుడిగా కె.అనిల్‌బాబు, గౌరవ సలహాదారుడిగా తోట భోగయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎ.రవిచంద్ర, ఉపాధ్యక్షులుగా మట్టా నాగబాబు, నడపన జగపతి, కోశాధికారిగా కామన రాంబాబు, కన్వీనర్‌గా ముతకన పిచ్చయ్య, కో-కన్వీనర్‌గా పైడిపాటి శివశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోరా రామమూర్తి, సహాయ కార్యదర్శులుగా ఏపీఎస్ రాజు, సరిపడికల వెంకటేశ్వరరావు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, సహాయ కోశాధికారులుగా దేవవరపు రఘు, చంద్రశేఖరరెడ్డితోపాటు మరో 8 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

బోళ్ల బుల్లిరామయ్య జయంతి వేడుకలు



బుల్లిరామయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సంస్థ అధికారులు

తణుకు: తణుకు ఆంధ్రా సుగర్స్ సంస్థ పూర్వ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య 97వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. స్థానిక ఆంధ్రాసుగర్స్ ప్రాంగణంలో బుల్లిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్ ఆర్ జనరల్ మేనేజర్ అడుసుమిల్లి సాంబశివ రావు, టెక్నికల్ సలహాదారు జి.రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు. సంస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: ప్రేమించి పెళ్లి చేసుకున్న కొద్ది కాలానికే అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం పట్టణం నర్సయ్య అగ్రహారానికి చెందిన ఆకుల ఈశ్వరి ప్రియ అదే ప్రాంతానికి చెందిన జయ శ్రీరాం ప్రేమించుకుని ఈ ఏడాది జనవరి 28వ తేదీన వివాహం చేసుకున్నారు. నాలుగు నెలల క్రితం హౌసింగ్ బోర్డు కాలనీలో వేరు కాపురం పెట్టారు. అప్పటినుంచి జయశ్రీరాం అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడంటూ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తీగే జీవనాధారం



సేకరించిన తీగలను ఇంటికి తీసుకు వస్తున్న దృశ్యం

అటవీ ప్రాంతంలో నల్లతీగ సేకరణే నాయక్‌పోడు గిరిజనులకు జీవనాధారం. నల్లతీగ సేకరణ చాలా ప్రమాదంతో కూడుకున్నది. దట్టమైన అడవిలో క్రూరమృగాలకు చిక్కకుండా, విష సర్పాలను తప్పించుకుంటూ ఎంతో నేర్పుతో వ్యవహరించాలి. తీగ సేకరణలో అనేక మంది కళ్లు కూడా పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. అలాగే పాము కాటుకు గురైన వారు కూడా ఉన్నారు. ప్రమాదాల మాటున కష్టపడి సేకరించిన తీగను విక్రయిస్తే రోజుకు రూ.300 వస్తాయని నాయక్ పోడు గిరిజనులు చెబుతున్నారు. నల్ల తీగ సేకరణలో వారు పడే శ్రమ, జీవనశైలిని తెలుసుకుందాం.



తీగలను కట్టలుగా చుడుతున్న మహిళ

పూర్వీకుల నుంచి ఇదే వృత్తి



పూర్వీకుల నుంచి నల్లతీగ సేకరణే మా జీవనాధారం. ఏటా జూన్ చివరి వారం నుంచి నల్లతీగ సేకరణ ప్రారంభిస్తాం. 7 నెలల వరకు ఉపాధి ఉంటుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి కొల్లేరు నుంచి వ్యాపారులు వచ్చి నల్లతీగను కొనుగోలు చేసి తీసుకువెళతారు.

– తేనె జ్యోతి, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

గతంతో పోలిస్తే కష్టంగా ఉంది



అడవిలో నల్లతీగల సేకరణ గతంలో పోల్చుకుంటే కష్టంగా ఉంది. మైళ్ల దూరం నడుచుకుంటూ వెళ్లినా నల్లతీగ దొరకడం లేదు. ఒకోసారి రోజంతా వెతికినా తీగలు దొరక్క ఇంటికి ఖాళీ చేతులతో వచ్చిన రోజులు ఉన్నాయి. కష్టమైన పనే అయినా మేము ఇష్టంగా చేస్తున్నాం.

–కుసినే వెంకటలక్ష్మి, లక్ష్మీపురం, బుట్టాయగూడెం

సాహసం చేయక తప్పదు



నా చిన్నతనం నుంచి నల్లతీగ సేకరణకు వెళుతున్నా. కొన్ని సార్లు జంతువులను చూసి తీగలు వదిలేసి వచ్చేశాం. తీగ సేకరణ సమయంలో మా వాళ్లల్లో కొందరు కళ్లు కోల్పోయారు. అలాగే పాముకాటుకు గురైన వాళ్లు ఉన్నారు. ఇదే ప్రధాన వృత్తి వల్ల సాహసం చేయక తప్పదు.

–తోట మంగ, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

మావుల తయారీకి వినియోగం



అడవిలో సేరించిన నల్ల తీగను కొల్లేరు పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో చేపలు, రొయ్యలు, పట్టుకోవడానికి ఉపయోగిస్తారు. తీగను రెండు రోజుల పాటు నీటిలో నానబెట్టి వెదురు పుల్లలతో మావులు తయారు చేస్తారు. వాటి ద్వారా చేపలు, రొయ్యలు పట్టుకుంటారు.

– కపిలివాయి హరి సూర్యనారాయణ, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

- అడవిలో ప్రమాదాల మాటున నల్లతీగ సేకరణ
- నాయక్ పోడు గిరిజనులకు ఇదే జీవనాధారం
- చేపలు పట్టే మావుల తయారీలో ఎక్కువగా వినియోగం



అడవిలో నల్లతీగ సేకరణలో గిరిజన మహిళలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం మండలంలోని లక్ష్మీపురం.. కొవ్వాడ ప్రాజెక్టు ముంపు పునరావాస గ్రామం. ఇక్కడ సుమారు 50 కుటుంబాలకు చెందిన నాయక్‌పోడు గిరిజనులు జీవిస్తున్నారు. వీరిలో 30 కుటుంబాలకు చెందిన వారు అడవిలో లభించే నల్లతీగ, చింతపండు, కుంకుళ్లు, వేప గింజలు వంటి ఉత్పత్తులను సేకరించి వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. నల్లతీగ సేకరణ కోసం సుమారు 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం వరకు అడవి వెంబడి కాలి నడకన నడుచుకుంటూ వెళ్లి పొదల్లో ఉన్న నల్ల తీగలను సేకరించి కట్టలుగా కట్టుకుని తలపై పెట్టుకుని ఇళ్లకు తీసుకువచ్చి చుట్టలుగా చుట్టి వ్యాపారులకు విక్రయిస్తారు.

రోజుకు రూ.500 ఆదాయం

అటవీ ప్రాంతంలో నల్ల తీగలను ఒక్కొక్కరూ 20 కట్టల వరకు సేకరిస్తారు. ఈ తీగలను ఇంటి వద్ద చిన్నసైజు కట్టలుగా చుట్టి ఒకో కట్టను రూ.25 చొప్పున విక్రయిస్తారు. మొత్తం 25 కట్టలకు రూ.625 వస్తే వాటిలో రూ.125 ఖర్చులు పోను రూ.500 మిగులుతాయి.

నల్లతీగతో ఉపయోగం

అడవిలో లభించే నల్ల తీగ చాలా దృఢంగా ఉంటుంది. ఈ తీగను జిల్లాలోని కొల్లేరు ప్రాంతంలో చేపలు పట్టే బుట్టల తయారీలో ఉపయోగిస్తారు. తీగలను రెండు రోజుల పాటు నీటిలో నానబెట్టి అనంతరం వెదురు పుల్లలను కలిపి మావులను తయారు చేస్తారు. ఈ మావులను మూడు నెలల పాటు చేపలు పట్టేందుకు వినియోగిస్తారు. గిరిజన ప్రాంతంలో సేకరించిన నల్ల తీగల కట్టలను ఆటోల్లో కొల్లేరుకు తీసుకువెళతారు. ఆకివీడు సమీపంలోని దుంపగడపలో నల్లతీగను వ్యాపారులు అధికంగా కొనుగోలు చేస్తారని నాయక్‌పోడు గిరిజనులు చెబుతున్నారు.

'శ్రేష్ఠ'కు 75 మంది విద్యార్థుల ఎంపిక



కత్తుల రిచర్డ్ సన్ జైన్



ఆర్.విశ్వాంత్

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధికి సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ శాఖ జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్ష శ్రేష్ఠలో తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ, గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి చదువుతున్న 75 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మొత్తం 104 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారంతా అర్హత సాధించారని ప్రిన్సిపల్ బి.రాజారావు ఆదివారం తెలిపారు. వీరంతా మూడు వేల లోపు ర్యాంకులు సాధించారన్నారు. జాతీయ స్థాయిలో కత్తుల రిచర్డ్ సన్ జైన్ 431, ఆర్.విశ్వాంత్ 605, వై.దశ్వంత్ 615, ఎన్.మానస్ వినయ్ 635వ ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపల్ బి.రాజారావు, వైస్‌ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం షాపు సొమ్ముతో సేల్స్‌మెన్ పరారీ

ఆకివీడు: అయిభీమవరం రోడ్డులోని ఓ మద్యం షాపులో పనిచేస్తున్న సేల్స్‌మెన్ శనివారం అమ్మకాల సొమ్ముతో పరారైనట్లు తెలిసింది. విషయాన్ని షాపు సూపర్‌వైజర్ ఎక్సైజ్ అధికారులకు తెలియజేయడంతో వారు ఆదివారం షాపులో మూడు గంటల సేపు తనిఖీలు చేశారు. మద్యం విక్రయించిన సొమ్ము జమ కాలేదని గుర్తించి సేల్స్‌మెన్ ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఈ వ్యవహారం తెలుసుకున్న సేల్స్‌మెన్ తండ్రి ఆకివీడు రూరల్ సీఐ గీతా రామకృష్ణను కలిసి అమ్మకం సొమ్ములో కొంత సొమ్ము జమ చేసినట్లు తెలిసింది. మిగిలిన సొమ్ము సోమవారం జమ చేస్తానని అంగీకరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో సుమారు రూ.3.80 లక్షల మద్యం అమ్మకం సొమ్ము ప్రభుత్వ ఖాతాకు జమ కావాల్సి ఉంది.

కేపీపాలెం బీచ్ కిటకిట



కేపీపాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ఎండ, వేడిగాలులతో వాతావరణం ఉన్నా పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. పోలీస్ అవుట్‌పోస్టు ఎస్సై హరి బాబు, సిబ్బంది బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. సముద్ర స్నానం అనంతరం పర్యాటకులు తీరంలోని వెంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగస్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్ట లక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో ఏలూరు రేంజ్ డీఐజీ



శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ దంపతులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదివారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ ఉన్నారు.

ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ కొట్టుకున్న యువకులు

కౌన్సెలింగ్ ఇచ్చిన సీఐ మూర్తి



పట్టణ పోలీస్‌స్టేషనలో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మూర్తి

నూజివీడు: పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో శనివారం రాత్రి ఆన్‌లైన్ గేమ్‌ను బెట్టింగ్‌కు ఆడుతూ యువకులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన కొందరు యువకులు, కొప్పుల వెలమపేటకు చెందిన మరికొందరు యవకులు ఎంప్లాయీస్ కాలనీలోని వినాయకుడి మండపం సమీపంలో ఆన్‌లైన్ గేమ్‌ను బెట్టింగ్‌కు ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం గెలవడం, ఒక వర్గం ఓడిపోవడంతో రెండు వర్గాల మధ్య చిన్నగా మొదలైన గొడవ పెద్దదై ఘర్షణకు దారి తీసింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి రాగా యువకులు పారిపోయే ప్రయత్నం చేయగా, వారిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు పెట్టి కోర్టుకు పంపితే జీవితం నాశనమవుతుందని, కాబట్టి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని గొడవలకు దూరంగా ఉండాలని యువకులకు హెచ్చరించారు. ఘర్షణకు దిగిన యువకుల తల్లిదండ్రులను సైతం పిలిపించి వారికి సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు.

13 మంది కోడిపందేల రాయుళ్ల అరెస్టు

కాళ్ల: కోడి పందేల స్థావరంపై దాడిచేసి 13 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలవపూడి గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 13 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.14,570 నగదు, 7 కోళ్లు, 13 సెల్‌ఫోన్లు, 6 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందు భాగం



రోడ్డుపై రెండు ముక్కలై ఉన్న ట్రాక్టర్ ఇంజిన్, దమ్ము చక్రాలు



ఏలూరులో చికిత్స పొందుతున్న ట్రాక్టర్ డ్రైవర్ దౌలూరి మరియన్న

- రెండు ముక్కలైన దమ్ముచక్రాల ట్రాక్టర్
- ఎగిరిపడ్డ ట్రాక్టర్ డ్రైవర్.. తీవ్ర గాయాలు
- భీమడోలు రైల్వే గేటు వద్ద హైవేపై ఘటన

భీమడోలు: భీమడోలు రైల్వే గేటు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి దమ్ము చక్రాలతో వెళుతున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. భీమడోలు పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడుకు చెందిన డ్రైవర్ దౌలూరి మరియన్న తన దమ్ము చక్రాల ట్రాక్టర్‌తో శనివారం రాత్రి సమయంలో భీమడోలు నుంచి పెదలింగంపాడు వెళుతున్నాడు. ఈ క్రమంలో భీమడోలు రైల్వే గేటుకు ఎదురుగా ఉన్న హైవే వంతెన వద్దకు దమ్ము చక్రాల ట్రాక్టర్ వచ్చేసరికి కాకినాడ నుంచి శ్రీశైలం వెళుతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్, దమ్ముచక్రాలు విడిపోగా, ట్రాక్టర్ నడుపుతున్న మరియన్న ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స తరలించారు. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. డ్రైవర్ మరియన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆదివారం చెప్పారు.

కారణాలు ఇవే

కేజీ వీల్స్‌తో ఉన్న ట్రాక్టర్‌కి ఇండికేషన్ లైట్లు లేకపోవడం, బురద అంటుకుని కనిపించకపోవడం, అదే దిశలో ఏలూరు వైపు వెళుతున్న ఆర్టీసీ డ్రైవర్, దగ్గరకు వచ్చేవరకు ముందు నెమ్మదిగా వెళుతున్న ట్రాక్టర్‌ను గమనించలేదు. దీంతో ట్రాక్టర్ కుడి వైపు కేజీ వీల్‌ను బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

ట్రాక్టర్ యాజమానులకు పోలీసుల వినతి

హైవేలపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను నడపడం నిషేధమని బీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆదివారం రాత్రి తెలిపారు. హైవేపై అతి వేగంగా ప్రయాణించే వాహనాల వల్ల కాక అతి నిదానంగా ఇలా కేజీ వీల్స్‌తో ప్రయాణించే వాహనాల వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు గుర్తించాలని కోరారు.

జిల్లాకు 5 టన్నుల టమాటాలు

రైతు బజార్లలో సబ్సిడీపై కిలో రూ.50కి విక్రయాలు ప్రారంభం



ప్రజలకు సబ్సిడీ టమాటాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో జిల్లాలోని రైతు బజార్లలో సబ్సిడీపై కిలో రూ.50కి విక్రయించేందుకు ఐదు టన్నుల టమాటాలను సిద్ధం చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ విప్పర్తి మహేంద్రనాథ్ చెప్పారు. ఆదివారం ఏలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏలూరులోని పత్తేబాద రైతు బజారులో రెండు టన్నులు, ఏలూరు వన్‌టౌన్ రైతు బజారులో ఒక టన్ను, నూజివీడు, కైకలూరు రైతు బజార్లలో ఒక్కొక్క టన్ను చొప్పున పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

పత్తేబాద రైతు బజార్‌లో పంపిణీ ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నెరుసు చిరంజీవులు అన్నారు. ఆదివారం స్థానిక పత్తేబాద రైతు బజారులో సబ్సిడీపై టమాటాలను ప్రజలకు పంపిణీ అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండుకు తగ్గట్టుగా ఉత్పత్తి లేని సందర్భాల్లో ధరలు పెరగడం సాధారణమేనని, అటువంటి సందర్భాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రజలకు అందుబాటు ధరలకే నిత్యావసర వస్తువులు అందించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలకు నిత్యావసరాలు, కూరగాయలు ధరలు పెరగకుండా నియంత్రణలో ఉంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఉల్లిపాయల ధరలు పెరిగిన సమయంలో కూడా ప్రజలకు సబ్సిడీ ధరలపై అందించామని గుర్తు చేశారు. టమాటా ధరలు దిగి వచ్చేవరకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై ప్రజలకు అందిస్తుందని చిరంజీవులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తేబాద రైతు బజారు ఎస్టేట్ అధికారి ఎం.సుధాకర్, ఏఎంసీ సభ్యులు, వినియోగదారులు పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం, నిందితులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎంఆర్‌సీ కాలనీ నుంచి అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన చీదెళ్ళ పవిత్ర కుమార్ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని ఏలూరు పరిసర ప్రాంతాల నుంచి సేకరించి తరలిస్తుండగా ఆదివారం ఉదయం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అధికారులు పట్టుకున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 50 కిలోల బరువున్న 80 బస్తాల్లో నింపిన రూ.72 వేల విలువైన 4వేల కిలోల బియ్యం, రూ. 6 లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్టాక్ యజమాని పవిత్ర కుమార్, స్టాక్ సరఫరాదారు ముచిగర్ల రాజు, వాహన డ్రైవర్, వాహన యజమానిలపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, సీఎస్‌డీటీ కె.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

జంగారెడ్డిగూడెం : కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంలో తనిఖీలు నిర్వహిస్తుండగా స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో గంటసాల సతీష్, కలిదిండి తాతారావు మినీ వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలను తరలిస్తూ కనిపించారన్నారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేసి నిందితులను ప్రశ్నించగా, రాజానగరంలోని చేపలకు వేసే మేతను తయారు చేసే ఫ్యాక్టరీకి ఈ వ్యర్థాలను తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. అయితే ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా వ్యర్థాలను రవాణా చేయడంతో పాటు, వాతావరణ కాలుష్యానికి కారణమయ్యారనే నేరంపై వారిద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కోళ్ల మాంసం వ్యర్థాలను స్థానిక డంపింగ్ యార్డులో ఖననం చేయించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మవారు

పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని కనకదుర్గమ్మవారికి గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆషాడమాస ప్రత్యేక పూజలు ఆదివారం ముగిసాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ నీలకంఠం, అర్చకులు కొత్తలంక శివసుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

12న భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర సదస్సు



మోదుగగుంటలో సదస్సు కరపత్రం విడుదల చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 12న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట గ్రామంలో రాష్ట్ర సదస్సు కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ డివిజన్ అధ్యక్షుడు కుందేటి శ్రీనివాస్, పామర్తి జాన్, బి.భాస్కరరావు, అంజయ్య, జాన్, సీహెచ్ వెంకన్న, ఎం.నరసింహారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్ల ఏర్పాటు అభినందనీయం



ఫంక్షన్ హాల్లో పూజ చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా పట్టణాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఫంక్షన్‌హాళ్ల ఏర్పాటు అభినందనీయమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రత్తిపాడు ఆరుగొలను రోడ్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులు వీర్ల సత్యనారాయణ, వీర్ల గోవింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్య విజయ పంక్షన్‌హాలును ప్రారంభించారు. జ్యోతి వెలిగించి పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ తణుకు నియోజకవర్గ నాయకులు చీర్ల రాధయ్య, ప్రత్తిపాడు త్రిపుల్ కర్మాగార ఎండీ ఓపీ గోయంకా, పార్టీ నాయకులు బొడ్డుసాయి, గుండుమోగుల బలుసులు, రాజా త్రినాథ్, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, రావిపాడు, అలంపురం సొసైటీల అధ్యక్షులు దేవ వెంకటరమణ, కొలనువాడ దత్తుడు, ములగాల రామసత్యనారాయణ (బాబ్జి), మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కన్జ్యూమర్ కోర్టులను సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో పాల్గొన్న కె.రమేష్ బాబు, బత్తుల ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినియోగదారుడు కొనుగోలు చేసిన వస్తువు, నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర ప్రమాణ సమాచారాన్ని తెలుసుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని జిల్లా ఆసరా అధ్యక్షుడు కె.రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్ అన్నారు. పట్టణంలో జిల్లా ఆసరా వినియోగదారుల సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ వినియోగదారులను చైతన్యం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా సభ్యులు ఎస్.సత్తిబాబు, ఎస్.నాగేష్, డి.నాగమోహన్, జి.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడపగడపన.. జన దీవెన



తణుకు 28వ వార్డులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి



తణుకు 28వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి



తణుకు 28వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న స్థానికులు

పండుగ వాతావరణంలో 100వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం

తణుకు అర్బన్: గడపగడపకు మన ప్రభుత్వం 100వ రోజు సందర్భంగా ఆదివారం తణుకు 28వ వార్డు శివాలయం వీధి నుంచి ప్రారంభమైన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డీజే సౌండ్స్‌తో బాణసంచా కాల్పులతో 100వ రోజు పండుగలా సాగింది. ఈ సందర్భంగా శివాలయం వీధి కనక దుర్గమ్మ గుడి ప్రాంతంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా అందిన పథకాలు వివరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం వారికి పథకాలతో కూడిన బ్రోచర్‌ను అందించి అందులోని అంశాలను చదివి వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ



అనాథాశ్రమానికి బియ్యం బస్తా అందజేస్తున్న దాట్ల జగన్నాథరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొండయ్య చెరువు సమీపంలోని లార్డ్ ఆఫ్ లైఫ్ అనాథాశ్రమంలోని చిన్నారులకు ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అడపా వెంకటాచలం కుటుంబ సభ్యులు సౌజన్యంతో 100 కిలోల బియ్యం ఆదివారం పాతూరు యూత్ సభ్యుడు దాట్ల జగన్నాథరాజు అందజేశారు. గోపిశెట్టి కిషోర్, బి.రాము, ఎం.కృష్ణ బాలాజీ, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు యూపీఎఫ్ సమావేశం

పెంటపాడు: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) సర్వసభ్యసమావేశం సోమవారం గూడెం భాగ్యలక్ష్మీపేటలోని ఎల్ఎల్ఎం చర్చిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి కారుమూరిని కలిసిన అత్తిలి ఎస్సై



తణుకులో మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అత్తిలి ఎస్సై రాంబాబు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావును అత్తిలి ఎస్సై వి.రాంబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అత్తిలి పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం తణుకులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అత్తిలి ఎస్సైగా రాంబాబు బాధ్యతల స్వీకరణ

అత్తిలి: అత్తిలి ఎస్సైగా వి.రాంబాబు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. భీమవరం టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై రాంబాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తమ సిబ్బందితో కలిసి కర్తవ్య విధులను నిర్వహిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఏఎస్సైలు వెంకట్రావు, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఎస్సైకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అత్తిలి ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువులతో 1985-86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అత్తిలి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం అత్తిలి ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన 1985–86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా 37 ఏళ్ల తరువాత కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకుని, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. వివిధ వృత్తులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఆనాటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కోరా సత్యనారాయణ, ప్రమీల, డి మాలతి, పమ్మి గోపాలకృష్ణమూర్తి, పి ఆనందరాజు, వై శ్రీనివాసరావు, ఎం సూర్యనారాయణ, కేశవరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. 2018 నుంచి 2020 వరకు పాఠశాల అభివృద్ధికి ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి మంగ దంపతుల కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి సత్యనారాయణ ఆర్థిక సహకారంతో పాఠశాల ప్రాంగణంలో కళావేదిక, సైకిల్‌షెడ్డు, పార్కింగ్ టైల్స్, అదనపు తరగతి గదులు, ఓపెన్ జిమ్, నీటి బోరు, టాయిలెట్లు ఆధునీకరణ, ప్రింటర్, కుర్చీలు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, నోటు పుస్తకాలు, దుస్తులు, షూలు అందజేసారని చెప్పారు. మృతి చెందిన 14 మంది మిత్రులకు సంతాపం ప్రకటించారు. అవసరమైన వారికి తోడ్పాటు అందించడం కోసం ఒక ఫండ్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేసారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులైన అడపా రాంబాబు, పొన్నా వీరనాగ గణేష్, బుద్దాల శ్రీను, దాసం సత్యనారాయణమూర్తి, బుద్దాల నాని, గాజుల సత్యనారాయణ, బసవా సూర్యనారాయణ, పచ్చిపులుసు శ్రీనివాస్, గంధం సత్యనారాయణ నిర్వహించారు.

నగదు రహిత వైద్య విధానం తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేట్ ప్రెసిడెంట్ బాలకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్లకు నగదు రహిత వైద్య విధానం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.బాలకృష్ణ అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్స్ చెల్లింపు విధానంలో రివర్స్ పీఆర్‌సీ ప్రకారం అమలుచేస్తోన్న పద్ధతిలో అన్యాయం జరుగుతోందన్నారు. రాబోయే కొత్త పీఆర్‌సీలో 65 నుంచి 90 పైబడిన వయస్సు వారందరికీ పాత పద్ధతే అమలు చేసి, వారికి న్యాయం చేయాలని కోరారు. ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని, పీఆర్‌సీ బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వీకే వీరారావు, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, ఎండీ ముస్తఫా, కె.వెంకటేశ్వరరావు, డి.సత్యనారాయణరాజు, జానకీరామరాజు, బాష, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెంటేవారితోటలో మావుళ్లమ్మ జాతర ప్రారంభం



మావుళ్లమ్మవారి జాతర నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలో ఆషాఢ మాసం సందర్భంగా మెంటేవారి తోట యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మావుళ్ళమ్మ అమ్మవారి జాతర ప్రారంభమైంది. ఈ జాతరను వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో స్థానిక శాసన సభ్యులు గ్రంధి శ్రీనివాస్ భీమవరం నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కాగా జాతరను పురస్కరించుకుని పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అమ్మవారి గరగరలతో, శక్తి వేషాలతో ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో ముత్యాల బాబులు, ఇంటి సత్యనారాయణ, ముత్యాల అంజి, కోయ మణి, ముత్యాల అయ్యప్ప, యర్రా నాని, ఆటో బాబి, సత్తిపండు, నొడురి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు

పెనుగొండ: సిద్ధాంతంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ మాస సారె ఆదివారం అంగరంగ వైభవంగా సమర్పించారు. గ్రామంలో ఆర్యవైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో ముందుగా ఆర్యవైశ్య మహిళలు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రావిచెట్టు సెంటర్‌లో వాసవీ మాత ఆలయంలో ఆషాఢ సారె సమర్పించారు.

భక్తుల రద్దీ

మొగల్తూరు: ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వాహన యజమానులు పూజలు చేయించుకునేందుకు భారీగా రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

పేదలకు దుస్తుల అందజేత

నరసాపురం రూరల్: మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్న గుంపుల జనార్దన్ తల్లి 24వ వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని పసలదీవి గ్రామంలో ఆదివారం కుటుంబ సభ్యులు స్థాపించిన సెవెన్ ఆలివ్స్ ట్రస్ట్‌ద్వారా పేదలకు దుస్తులను అందజేశారు. పసలదీవి, పేరుపాలెం, యలమంచిలి, మైజేరుగుంట తదితర గ్రామాలకు చెందిన 150 దుస్తులను అందజేశామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యుడిగా జాన్‌లియో

యలమంచిలి: దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర రెండవ వైద్యాధికారి డాక్టర్ జాన్‌లియో నియమితులయ్యారు. ఆయన పాలకొల్లు అర్బన్ (వీవర్స్ కాలనీ) పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ డాక్టర్ కె.చంద్రరేఖ మొదటి వైద్యాధికారిగా పని చేస్తున్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ 316జి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పేర్కొన్నారు. అమెరికా బోస్టన్ సిటీలో అంతర్జాతీయ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు డాక్టర్ పాటి హిల్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. క్లబ్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో అందాలని అంతర్జాతీయ నాయకులు సూచించినట్లు తెలిపారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ములకలంకకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ చిట్టూరి కృష్ణావతారం పాల్గొని జ్ఞాన బోధ చేశారు. మన జీవితంలో ప్రతిరోజు శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయడం, మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, పరస్పర అవగాహన పాటు మిత్రలాభాన్ని పొందవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, తీడ నాగరాజు, సబ్బారపు వెంకటరావు, కె.మోహన్ కుమార్, సన్నిధి ఉదయ్, మీసాల భవాని, సబ్బారపు కమల, బోళం యర్రాయమ్మ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు

భీమవరం అర్బన్: భీమవరం నుంచి కాళీపట్నం వెళ్లే ఆర్అండ్ బీ రోడ్డు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాళీపట్నం లాకుల సమీపంలోని అశ్విని రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై భారీ కంటైనర్లు నిలుపుదల చేయడంతో రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రోడ్డు నిర్వహణను పట్టించుకోవాల్సిన ఆర్ అండ్ బీ అధికారులు చూసి చూడనట్లు వదిలేయడంతో పలువురు వాహనదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

సాక్షి, భీమవరం: పెరుగుతున్న ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో బలరాం మాట్లాడుతూ జిల్లాలో నిత్యావరసరాలు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరగడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో చింతకాయల బాబురావు, కవురు పెద్దిరాజు, పీవీ ప్రతాప్, డి.కల్యాణి, బి.వాసు దేవరావు తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉపాధ్యాయ సంఘ సమావేశం



ఉపాధ్యాయుల సంఘ డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని అంకాల ఆర్ట్ అకాడమీలో, జిల్లాలో ఉన్న జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘ సమావేశం సంఘాధ్యక్షుడు బి.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ సంవత్సరం జిల్లా సంఘం తీసుకున్న నూతన నిర్ణయాల గురించి చర్చించారు. ఐఎఫ్‌పీ ట్రైనింగ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పార్ట్‌టైమ్ ఉపాధ్యాయిని వి.భాగ్యలక్ష్మికి రూ.29 వేలను సమకూర్చి అందచేశారు. అనంతరం సంఘ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలరాజు, బి.రవి, టి.చిట్టి, ఎంవీఎస్ మూర్తి, పి.సుబ్బారావు, టి. చినబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పండుగలా వ్యవసాయం



సత్కారం పొందిన అభ్యుదయ రైతు చల్లారావు

ఆకివీడు : అన్నదాతల ఆర్థిక పరిస్థితుల్ని మెరుగుపరచి, వ్యవసాయం పండుగగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఉండి కేవీకే డైరెక్టర్, అభ్యుదయ రైతు నంద్యాల సీతారామయ్య అన్నారు. రైతు దినోత్సవం పురస్కరించుకుని శనివారం మార్టేరులో శాస్త్రవేత్తలు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా సీతారామయ్య ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలు విప్లవాత్మక మార్పుల్ని తీసుకువచ్చాయన్నారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ దళారుల బెడద లేకుండా చేయడం చరిత్రాత్మకమన్నారు. పల్లెల్లో రైతు భరోసా కేంద్రాలు రైతు ముంగిటకే వచ్చి సేవలందిస్తున్నాయని చెప్పారు. పంట నష్టపరిహారం, పంటల బీమా, సున్నా వడ్డీకి రైతు రుణాలు వంటివి రైతుకు వెన్నుదన్నుగా నిలిచాయని చల్లారావు చెప్పారు. మార్టేరు శాస్త్రవేత్తలకు, సీఎం వైఎస్ జగన్‌కు చల్లారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న కాలనీలో వేగంగా అభివృద్ధి పనులు



గొల్లవానితిప్పలోని కాలనీలో రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



వేగంగా నిర్మాణమవుతున్న ఓహెచ్ఆర్ ట్యాంకు పనులు



వీధిలైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ (ఫైల్)

రూ. 2 కోట్లతో ఓహెచ్ఆర్, రోడ్ల నిర్మాణాలు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో 18 ఎకరాల్లోని జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. కనీస వసతులైన రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చేందుకు ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. జగనన్న కాలనీలో మొత్తం 520 ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారం చేపట్టగానే అర్హులైన లబ్ధిదారులకు 165 ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. వీటిలో 42 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారం చేపట్టగానే జగనన్న కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి అంతర్గత రోడ్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా గృహాలు నిర్మించుకునేవారికి సత్వరమే బిల్లులు మంజూరు చేయడంతో 165 మంది లబ్ధిదారులకు 42 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారు. అంతేకాకుండా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. గత మూడు నెలలు క్రితం రూ. 10 లక్షలతో వీధి లైట్లు ఏర్పాటు చేశారు.

సుమారు రూ. 2 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించి జగనన్న కాలనీకి స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు రూ. కోటి 46 లక్షలతో ఓహెచ్ఆర్ ట్యాంకు, పైపులైన్‌లు, ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. ఆ పనులు వేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా అంతర్గత రోడ్లపై గ్రావెల్ వేయడానికి సుమారు రూ. 60 లక్షలతో అంతర్గత రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో రోడ్లు, ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ జగనన్న కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తోనే అభివృద్ధి సాధ్యం



గతంలో ఈ కాలనీలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం, తాగునీరు అందిచడం వంటి కనీస మౌలిక వసతులపై దృష్టి పెట్టలేదు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టడంతో సుమారు రూ. 2 కోట్లతో రోడ్లు, ఓహెచ్ఆర్ ట్యాంకు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారు. కాలనీ అభివృద్ధి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తోనే సాధ్యమైంది.

– చిల్లే వెంకటేష్, సర్పంచ్, గొల్లవానితిప్ప